# పోస్టల్ శాఖలో ఈజీఎస్ పింఛన్లు



మోడి తపాలా కార్యాలయం



దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న బీపీఎం మహేశ్(ఫైల్)

- ఆధార్ అనుసంధానంతో పోస్టల్ శాఖలో లావాదేవీలు నిర్వహించాలి
- టీజీబీలో పింఛన్ డబ్బుల కోసం గంటల తరబడి నిరీక్షణ

కెరమెరి, డిసెంబర్ 2: తపాలా శాఖ కార్యాలయలు ఉత్తరాలు, పాన్‌కార్డులు, ఇతర కోరియర్ల పంపిణీతో పాటు ఈజీఎస్ కూలీల డబ్బులు, ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ పంపిణీ చేస్తోంది. దీంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో డబ్బులు తీసుకునేలా చర్యలు చేపట్టింది. ఇదే తరహాలో బ్యాంక్‌లా డబ్బుల లావాదేవీలు బయోమెట్రిక్‌తో నిర్వహించేలా ఆ శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ డబ్బులు స్థానిక తపాలా కార్యాలయంలో తీసుకోవడంతో వారికి ఎంతో సౌకర్యంగా మారింది. ప్రస్తుతం మండల కేంద్రంలో కేవలం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఒక్కటే ఉండడంతో వినియోగదారుల సంఖ్య పెరిగి బ్యాంకులో 'క్యూ' కట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే కాకుండా బ్యాంక్‌కు వెళ్తే వోచర్ రాసి క్యాషర్ కౌంటర్‌లో గంటల తరబడి నిలబడడం ఇబ్బందికరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్‌శాఖలో అయితే రద్దీ ఉండదని ఆధార్ అనుసంధానంతో బ్యాంకుల లాగా లావాదేవీలు నిర్వహించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకు లేకపోవడంతో పాటు టీజీబీలో కనీసం ఏటీఎం సెంటర్ సైతం ఏర్పాటు చేయకపోవడంతో చాలా మంది ప్రజలు ప్రైవేట్ ఆన్‌లైన్ సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు.

### అందుబాటులో పింఛన్ డబ్బులు తీసుకుంటున్నం



ప్రతి నెల ఇచ్చే ఆసరా పింఛన్ డబ్బులు అందుబాటులో తీసుకుంటున్న. మా గ్రామానికి సమీపంలోనే పోస్టాఫీసు ఉంది. పింఛన్ వచ్చిందని సమాచారం రాగానే నడుచుకుంటూ వెళ్లి డబ్బులు తీసుకుంటున్నా. మా గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు కూడా డబ్బులు ఇక్కడే తీసుకుంటున్నారు. అందుబాటులో డబ్బులు తీసుకునే సౌకర్యం కల్పించినందుకు చాలా ఆనందంగా ఉంది.

-వడ్లూరి బుచయ్య, పింఛన్ లబ్ధిదారుడు, బారేమోడి, (కెరమెరి).

### బ్యాంకు లాగే లావాదేవీలు నిర్వహించాలి



బ్యాంకు తరహాలో పోస్టాఫీసులో లావాదేవీలు నిర్వహించాలి. నాకు వ్యవసాయ భూమి ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతు బంధు డబ్బులు కెరమెరిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాలో పడుతున్నాయి. వచ్చిన డబ్బులు తీసుకోవాలంటే బ్యాంక్‌కు వెళ్లి ఎదురు చూస్తూ ఉండాల్సిన పరిస్థితి ఉంది. అదే పోస్టాఫీసులో రద్దీ తక్కువగా ఉండడంతో తొందరగా డబ్బులు తీసుకుంటున్నం. అత్యవసరం ఉన్నప్పుడు బ్యాంక్‌కు వెళ్లలేని సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకే బ్యాంకులాగా తపాలా కార్యాలయంలో లావాదేవీలు అమలు చేయాలి.

- టేకం జల్పతిరావ్, గోండ్ ఝురి(కెరమెరి).

## నేడు దివ్యాంగుల దినోత్సవం

రెబ్బెన, డిసెంబర్ 2: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సీఈఆర్ క్లబ్ లో ఆదివారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఏరియాలోని గోలేటి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న దివ్యాంగులు ఉదయం 9గంటలకు క్లబ్ వద్దకు రావాలని వారికి క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామని తెలిపారు. దివ్యాంగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గ్యాస్ కనెక్షన్ల ఫింగర్ ప్రింట్ అప్‌డేట్



బెజ్జూర్‌లో ఈ కేవైసీ చేసుకుంటున్న మహిళలు

బెజ్జూర్, డిసెంబర్ 2 : దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న గ్యాస్ కనెక్షన్‌లపై ఈకేవైసీ ఫింగర్ ప్రింట్ అప్‌డేట్ మండల కేంద్రంలో కొనసాగుతున్నది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ కనెక్షన్‌లు గల ప్రతి ఒక్కరూ ఫింగర్ ప్రింట్‌లను అప్‌డేట్‌ను గ్యాస్ గోదాం వద్ద చేసుకోవాలని డిస్ట్రిబ్యూటర్ నరేందర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## బర్డ్‌వాక్ ఫెస్టివల్ ను విజయవంతం చేయాలి

- కాళేశ్వరం సర్కిల్ / ఎఫ్‌డీపీటీ కవ్వాల్ టైగర్ జోన్ సీఎఫ్ శాంతారాం



మండల కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న సీఎఫ్ శాంతారాం

బెజ్జూర్, డిసెంబర్ 2 : డిసెంబర్ నెలలలోపు కాగజ‌నగర్ డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్, సిర్పూర్, పెంచికల్‌పేట ,బెజ్జూర్ రేంజ్‌లలో బర్డ్ వాక్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు కాళేశ్వరం సర్కిల్/ఎఫ్‌డీపీటీ కవ్వాల్ టైగర్ జోన్ సీఎఫ్ శాంతారాం అన్నారు. ఈ సందర్భంగా బర్డ్‌వాక్ ఫెస్టివల్‌ను విజయవంతం చేసేందుకు శనివారం ఆయన మండల కేంద్రంలోని అటవీశాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అటవీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. డిసెంబర్, జనవరి మాసాల్లో దేశ విదేశ పక్షులు వలసలు వచ్చి ప్రకృతిలో కొత్త శోభను కనబర్చేలా చేస్తాయన్నారు. ఇందుకోసం పక్షి ప్రేమికులు కొత్త కొత్త వలస పక్షులను తమ కెమెరాల్లో బంధించి వాటి జీవన శైలిపై అధ్యయనం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు, పక్షి ప్రేమికులు గ్రామీణ, అటవీ ప్రాంతాలలో నివసించే ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలను సైతం అధ్యయనం చేసే విధంగా బర్డ్‌వాక్ ఫెస్టివల్ ఉపయోగపడనుందని చెప్పారు.రకరకాల పక్షి జాతులతో పాటు వన్య ప్రాణుల సంచారంతో జీవ వైవిధ్యానికి అనువైన ప్రాంతంగా కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. బర్డ్ వాక్ ఫెస్టివల్‌లో పాల్గొనే అధికారులు, పక్షి ప్రేమికులకు కావలసిన వసతుల ఏర్పాట్లపై ఆయా రేంజ్‌లలో అధికారులు అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కర్జెల్లి రేంజ్ పరిధిలోని కుకుడ బీట్‌లోని అటవీ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్ కుమార్ టెబ్రీవాల్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో వేణుబాబు, రేంజ్ అధికారులు దయాకర్, వేణుగోపాల్, చంద్ర మౌళి, పూర్ణచందర్, డీఆర్‌వో శ్రావణ్, రమాదేవి, ప్రభాకర్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, అనిమల్ ట్రాకర్స్ సిబ్బంది ఉన్నారు.

## నేడే తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ప్రజలు

వాంకిడి,డిసెంబర్ 2: ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన సభ్యుల అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల నుంచి ఆదివారం తేలనుంది.గత నెల 30న అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో గెలుపోటములపై ఉత్కంఠ నెలకొంది. నిన్నటివరకు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం రాత్రింబవళ్లు, కష్టపడ్డ నాయకులు,కార్యకర్తలతో పాటు ప్రజలు ఆదివారం వెలువడబోయే ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరికి వారు తమ అభ్యర్థి గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేస్తూ ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఫలితాలు ఏవిధంగా వస్తాయి. ఏపార్టీకి ఎంత మెజార్టీ వస్తుంది.ఎవరు గెలుపొందుతారన్నదే ప్రస్తుతం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రధాన చర్చగా మారింది.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

జైనూర్ సెప్టెంబరు 2: మండలంలోని మారుమూల గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే కొనసాగుతున్నది. శనివారం మండలంలోని ఉషేగాంలో సర్కారు దవాఖాన పరిధిలోని కోలాంగూడలో రాఫిడ్ ఫివర్ సర్వే నిర్వహించి డ్రమ్ములు, డబ్బాలలో నిల్వ నీటిని వైద్య సిబ్బంది తొలగింపజేశారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు తదితర వస్తువుల్లో ఎక్కువ రోజులపాటు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎక్కువ రోజుల పాటు నీరు నిల్వ ఉన్నట్లయితే వారం 10 రోజులో ఈగలు దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని వివరించారు. అంతకుముందు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ జాదవ్ రమేశ్‌హెల్త్ అసిస్టెంట్ అంగన్‌వాడీ కార్యకర్తలు, అశ వర్కర్లు పాల్గొన్నారు.

## పేడే లుగా పరిగణించాలి

రెబ్బెన, డిసెంబర్ 2: ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి కార్మికులందరి మాస్టర్స్‌ను పే డే గా పరిగణించాలని బెల్లంపల్లి ఏరియా హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు కోరారు. ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడారు. సింగరేణిలో సెలువు దినం విధులు నిర్వహించిన వారికి రెండు మాస్టర్స్ చెల్లించే యజమాన్యం ఎన్నికల్లో విధులు నిర్వహించిన క్లర్కులు, ఎస్అండ్‌పీసీ సిబ్బందికి, ఇతర కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి, ఏరియా ఆర్గనైజర్ అనూస్, ఎస్అండ్‌పీసీ పిట్ సెక్రటరీ శ్రీనివాస్, హాస్పిటల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, భిక్షపతి ఉన్నారు.

## పొగమంచుతో పంటలకు తెగుళ్లు



లగ్గాంలో పంటలను కమ్మేసిన పొగమంచు

దహెగాం,డిసెంబర్2 : మండలంలో గత మూడు రోజులుగా పొగమంచు నెలకొంటున్నది. పొగమంచు ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో ముఖ్యంగా మిరప, కంది, పెసర, జొన్న తదితర పంటలకు నష్టం చేసే పురుగు ఆశించడంతో పాటు ముడత లాంటి తెగుళ్లు వచ్చి పంటలకు నష్టం జరుగుతందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటలకు వాతావరణంలో మార్పుల కారణంగా వివిధ రకాల తెగుళ్లు రావడంతో పంటలు ఆశించిన స్థాయిలో ఎదుగడం లేదని దానికి తోడు మూడు రోజులుగా పొగమంచు కురుస్తుండడంతో పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.అదేవిధంగా ఉదయం సమయంలో దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

## మొబైల్ ఫోన్ అందజేత

రెబ్బెన, డిసెంబర్ 2: కాగజ్‌నగర్ కు చెందిన సునీల్‌కు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో శనివారం పోగొట్టుకున్న మొబైల్‌ను అందించినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సునీల్‌కు చేందిన రియల్ మీ 6 ప్రో మొబైల్ పోగొట్టుకొగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి అందించినట్లు తెలిపారు.

## నేడు రావులమల్లన్న బోనాల జాతర

దహెగాం, నవంబర్2: మండల కేంద్రంలో ఆదివారం రావులమల్లన్న బోనాల వేడుకలు జరుగనున్నాయి. మండల కేంద్రం సమీపంలోని మల్లవాగు సమీపంలోని రావులమల్లన్న ఆలయం వద్ద బోనాల జాతర జరుగనుంది. కార్తీక పౌర్ణమి తర్వాత వచ్చే మొదటి ఆదివారం బోనాల వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. భక్తులు ఆలయం వద్దకు చేరకొని కొత్తబియ్యంతో బోనాలను వండి స్వామి వారికి అర్పించడంతో పాటు మొక్కులను తీర్చుకుంటారు. ఈ వేడుకలకు దహెగాంతో పాటు పెంచికల్‌పేట, బెజ్జూర్, కాగజ్‌నగర్, భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి, మందమర్రి, తదితర మండలాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.